క్లుప్తంగా

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం



బోధన్‌టౌన్(బోధన్): హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్‌సింగ్ స్పష్టం చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి సభ నిర్వహించారు. ఈ సభకు 108 విరూపాక్ష మహరాజ్(మహారాష్ట్ర), విశ్వేశ్వర పీఠ శ్రీ ప్రణవానంద స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మా శరత్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అతిథులు మాట్లాడారు. గోవధ మహాపాపమని, గోరక్షణ చేయడం ప్రతీ హిందువు బాధ్యతని, గోవులను వధించకుండా కాపాడుకోవాలని సూచించారు. లవ్ జిహాద్ అంటే ప్రతీ ఒక్కరికి తెలియాలని అప్పుడే అరికట్టవచ్చని పేర్కొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి




మోర్తాడ్(బాల్కొండ): బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి భౌతికదాడులకు పాల్పడాలని, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు సూచిస్తూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. ఏర్గట్లలో మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజాస్వామ్య దేశంలో ఉన్నవారు ప్రభుత్వాలు తప్పు చేస్తే నిరసన తెలియజేయడం తప్పా అని ప్రశ్నించారు. శుక్రవారం ఏర్గట్ల పోలీస్‌స్టేషన్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రం అందించారు. పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ కేసులో ఎవరైనా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తే భౌతికదాడులకు పాల్పడాలని మంత్రి రెచ్చగొట్టడాన్ని తప్పుబట్టారు. నాయకులు మల్కన్నగారి మోహన్, నిమ్మల శ్రీనివాస్, జీవీ నర్సింహారెడ్డి, ఏలేటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



మాక్లూర్: కల్లెడి గ్రామానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం స్థానిక జీపీ భవన ప్రాంగణంలో వైస్ ఎంపీపీ సుక్కి సుజాత సుధాకర్ పంపిణీ చేశారు. వీరందరు వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకొని సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరై చెక్కులు రావడంతో అందజేశారు. ఉప సర్పంచ్ మనీష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్, చిన్న రమేష్, రాజు, మల్లారెడ్డి, సాయిలు, పసుల గంగారెడ్డిలు పాల్గొన్నారు.

నూతన జీపీ భవనాలకు భూమి పూజ



భీమ్‌గల్: దేవన్‌పల్లి, కారేపల్లి, తాళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్యల ఆధ్వర్యంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన కొనసాగిస్తుందన్నారు. రైతు బంధు మండల అధ్యక్షుడు శర్మ నాయక్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు మొయిజ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భీమ్‌గల్: పట్టణంలో ఈ నెల 16న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, ఎంజే ఆస్పత్రి అధినేత డాక్టర్ మధు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంప్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కో–ఆర్డినేటర్లు పర్స నవీన్, జేజే నర్సయ్య, సంధ్య నగేష్‌లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న 44వ ఉచిత సర్జికల్ క్యాంప్, మల్టీ స్పెషాలిటీ హెల్త్ చెకప్ మెగా క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

నిరుపయోగంగా పసుపు కేంద్రం

- శిథిలావస్థకు చేరిన వైనం
- శాస్త్రవేత్తలు లేకపోవడంతో నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం



ధర్పల్లి పసుపు పరిశోధన కేంద్ర భవనం

ధర్పల్లి: పసుపు రైతు ఆవేదన అంతా ఇంతా కాదు. ఏ రకం విత్తనం వేయాలో ఏ పద్ధతిలో పంటను పండించాలో తెలియక పసుపు రైతులు అగచాట్లు పడుతున్నారు. పండించిన పసుపు పంటకు తెగుళ్లు సోకినప్పుడు సలహాలు సూచనలు ఇచ్చే శాస్త్రవేత్తలు కరువయ్యారు. అధిక మొత్తంలో పసుపు పంటపైన పెట్టుబడులు పెట్టి ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో నష్టపోయి పసుపు రైతులు కుంగిపోతున్నారు. ధర్పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు, సిబ్బందిని నియమించకపోవడంతో ఎవరూ లేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. నాణ్యమైన పసుపు సాగుకు సలహాలు సూచనలు అందించాలన్న ఉద్దేశంతో నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో 400 వందల ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేస్తున్నారు. దీనికి తోడు చుట్టుపక్కల మండలాలైన సిరికొండ, భీంగల్, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో రైతులు పసుపు సాగును అధికంగా చేపడ్తారు. పసుపు సాగులో కొత్త మార్పులు, సాగు విధానం సలహాలు సూచనలు అందించే ఉద్దేశంతో రైతులు నష్టపోకుండా ధర్పల్లి కేంద్రంగా అప్పటి ప్రభుత్వం 2008లో పసుపు పరిశోధన కోసం స్థలాన్ని కొనుగోలు చేసి భవనాలను నిర్మించింది. కాని పరిశోధనలకు కావాల్సిన సిబ్బంది, సామగ్రి కేటాయించకపోవడంతో భవనాలు వృథాగా మారాయి. దీంతో భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. అప్పటి ప్రభుత్వం రూ.35.85 లక్షలు మంజూరు చేసి, తొలి విడతగా రూ.15 లక్షలు విడుదల చేసింది. మంజూరైన నిధులతో పరిశోధనలు జరుగుతాయని ఆశించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

సిబ్బంది కరువు

పరిశోధన కేంద్రాలకు అవసరమైన శాస్త్రవేత్తలు, సిబ్బంది కేటాయించకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ప్రధానంగా ధర్పల్లి, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లో స్థలాలు కొనుగోలు చేసి భవనాల నిర్మాణం చేపట్టారు. కేవలం కమ్మర్‌పల్లి మండలంలో ఉన్న పసుపు పరిశోధన కేంద్రంలో మాత్రమే పరిశోధనలు జరుగుతున్నాయి. జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ, నందిపేట్, జక్రాన్‌పల్లి, మెండోరా, వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, ముప్కాల్, కమ్మర్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల్లో అత్యధికంగా పసుపు పంటను సాగు చేస్తారు. ఆధునిక యాంత్రీకరణ విధానాలు తెలియకపోవడం వల్ల ఇప్పటికీ రైతులు మూస పద్ధతిలో పసుపు సాగు విధానాన్ని చేపడుతున్నారు.

శాస్త్రవేత్తలను నియమించాలి



తరతరాలుగా పసుపు పంటను సాగు చేస్తున్నాం. ఒకే రకం సాగు విధానంతో పసుపు పండించడంతో నష్టపోతున్నాం. మాకు శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటే వారు చెప్పే సలహాలు సూచనల ఆధారంగా పంట సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రభుత్వం, అధికారులు పసుపు పరిశోధన కేంద్రానికి మరమ్మతులు చేపట్టి ప్రారంభించాలి. – నర్సారెడ్డి, పసుపు రైతు, గడ్కోల్

‘పంట నష్టపరిహారం వెంటనే అందించాలి’



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

ఖలీల్‌వాడి: భారీ వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారాన్ని వెంటనే ఇవ్వాలని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపాదికన ప్రారంభించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. బుధ, గురువారాల్లో తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో మొక్కజొన్న, వరి, పత్తి, మార్కెట్లో ఉన్న మిర్చి తదితర పంటలు విపరీతంగా నష్టపోయాయన్నారు. సీఎం కేసీఆర్ కొన్ని జిల్లాలు పర్యటించి ఎకరాకు రూ.10 వేలు తాత్కాలిక సాయం కింద రైతులకు ఇవ్వాలని ప్రకటించి పది రోజులు గడిచినా వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా సర్వేలే చేయలేదన్నారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.లక్ష, ఇతర పంటలకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు.

రేషన్ షాపుల్లో 12 రకాల సరుకులివ్వండి



డిచ్‌పల్లి: రేషన్ షాపుల్లో ప్రజలకు అవసరమైన 12 రకాల నిత్యావసర సరుకులు, ప్రతి మనిషికి 10 కేజీల బియ్యం, 50 శాతం సబ్సిడీపై వంట గ్యాస్‌ను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పీవోడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలంలో పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులైన వంట నూనె, గోధుమ పిండి, కందిపప్పు, పెసర పప్పు, పసుపు, పంచదార, కారం, ఉప్పు, చింతపండు, టీ పొడి, సబ్బులు మొదలైన సరుకులను పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందించాలని కోరారు. అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



నడిపల్లి సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ధర్మారం(బి)లో ఊరేగింపు

క్రైస్తవులు గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం జిల్లాలో పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. సర్వ మానవాళి కోసం యేసు ప్రభువు మనిషిలా భూలోకానికి వచ్చి పాప విముక్తి కోసం ప్రాణ త్యాగం చేసిన పవిత్రమైన రోజు గుడ్ ఫ్రైడే అని వివరించారు. అనంతరం భక్తులకు శిలువపై గల 7 జ్ఞాన వాఖ్యల గురించి వివరించారు. – డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ/సిరికొండ



నగరంలోని నిర్మల హృదయ చర్చిలో నాటకం ప్రదర్శిస్తున్న చర్చి యూత్ సభ్యులు



కొండాపూర్ చర్చిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కమ్ముకున్న మబ్బులు.. అన్నదాత గుండెల్లో గుబులు



నల్లవెల్లిలో తాటిపత్రిలు కప్పి ఉంచిన ధాన్యం రాశులు

ఇందల్వాయి: జిల్లాకు శుక్ర, శనివారాల్లో వర్షంతో పాటు వడగండ్లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించడం, ఆకాశం మేఘాలతో కమ్ముకోవడంతో జిల్లా వ్యాప్తంగా వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోతకు వచ్చిన రైతులు వరి కోత యంత్రాల కోసం పడిగాపులు కాస్తే, కోతలు పూర్తయిన రైతులు ధాన్యం ఆరబెట్టి తడవకుండా జాగ్రత్తలు పడుతున్నారు. మామూలు వర్షంతో నష్టం తక్కువగా ఉంటుంది కానీ వడగండ్లు పడితే అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు కలవరపడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించడమే కాకుండా రాయితీపై తాటిపత్రిలు అందించాలని రైతులు కోరుతున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



దుబ్బాక వీడీసీ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి: అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం దుబ్బాక గ్రామంలోని వీడీసీ, పద్మశాలి సంఘం భవనాల నిర్మాణంతో పాటు ఇంద్రానగర్ తండాలోని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.14 లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీలను సంఘం నాయకులకు అందజేశారు. దుబ్బాక ఉప సర్పంచ్ ప్రతాప్ గౌడ్, వీడీసీ సభ్యులు సంతోష్ రెడ్డి, సురేందర్, తదితరులున్నారు.

మల్కాపూర్(ఏ)కు ఎస్‌డీఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలు..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్(ఏ) గ్రామానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మల్కాపూర్(ఏ)లో మహాలక్ష్మీ ఆలయం ప్రహరీకి రూ.4 లక్షలు, గంగపుత్ర సంఘానికి రూ.4 లక్షలు, గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ. 3 లక్షల ఎస్‌డీఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులకు అందజేశారు. మల్కాపూర్(ఏ) సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు బాగారెడ్డి, న్యాయవాది సాయన్న, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

సిరికొండ: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డైరీని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, మండలాధ్యక్షుడు శంకర్, డీసీఎంఎస్ అధ్యక్షుడు మోహన్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ తిర్మల్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కార్యక్రమానికి హాజరైన మహిళా భక్తులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని మారుతినగర్‌లో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో శుక్రవారం కుబేర పాశుపతాస్త్ర సహిత అష్టలక్ష్మీ హోమం, శ్రీ చక్రార్చన, లక్ష గాజులార్చన, లక్ష కుంకుమార్చన, పుష్పార్చన కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. నగర మహిళలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహిళలకు అల్పాహారం, అన్నప్రసాద వితరణ చేశారు.

సమాచారం..

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం డిచ్‌పల్లి మండలానికి సంబంధించి బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం శనివారం బర్ధిపూర్ శివారులోని అమృతాగార్డెన్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో శనివారం జరుగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు జిల్లా నుంచి తరలివచ్చి జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య శుక్రవారం కోరారు. సభకు జిల్లా పదాధికారులు, జిల్లా, రాష్ట్ర నాయకులు, అసెంబ్లీ కన్వీనర్లు, వివిధ మోర్చాల పదాధికారులు, మండల ఇన్‌ఛార్జిలు, మండల అధ్యక్షులు పెద్ద ఎత్తున తరలి రావాలని పేర్కొన్నారు.

నీటి కొరత తీర్చాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోపాల్(నిజామాబాద్ రూరల్): మండలంలోని బైరాపూర్, అమ్రాబాద్ గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం కింద నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, వెంటనే నీటి కొరత తీర్చాలని సర్పంచులు కోరారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను శుక్రవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో వేసవి దృష్ట్యా నీటి కొరత ఏర్పడుతోందని, గిరిజనులు పొలాల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని తెలిపారు. వీలైనంత త్వరగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సర్పంచి గోకుల్‌సింగ్, పార్టీ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలు అణచివేతకు గురవుతున్నారు



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలో వెనకబడిన వర్గాలు అన్ని రంగాల్లో అణచివేతకు గురవుతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని 8వ డివిజన్ సాయినగర్‌లో వాడవాడకూ ఓబీసీ – ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మంత్రి వర్గంలో బీసీలకు అవకాశం కల్పించారని, నవోదయ విద్యాలయంలో 27 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. తద్వారా పేద బీసీ విద్యార్థులు లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు ఉపాధి నిమిత్తం సబ్సిడీ రుణాలు కూడా ఇవ్వడం లేదని గుర్తు చేశారు. నేతలు నాగరాజు, ఇప్పకాయల కిషోర్, గిరిబాబు, మారుతి, శ్రీనివాస్, శ్రవణ్, సుందర్‌సింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

‘సీఎం కేసీఆర్ దళిత వ్యతిరేకి’



దళితవాడలో దళితులతో కలిసి భోజనాలు చేస్తున్న బీజేవైఎం నాయకులు

మోపాల్: రాష్ట్రంలోని దళితులకు అనేక రకాలైన హామీలిచ్చి విస్మరించారని, సీఎం కేసీఆర్ దళిత వ్యతిరేకి అని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేవైఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు నగర శివారులోని బోర్గాం (పి) 5వ డివిజన్ దళితవాడలో స్థానిక ప్రజలతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నందగిరి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏప్రిల్ 7 నుంచి 14 వరకు సేవా పక్షంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో దళిత వాడల్లో స్థానిక ప్రజలతో కలిసి భోజనాలు చేస్తామని తెలిపారు. దళితులను సీఎం కేసీఆర్ కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, దళిత బంధు, దళితుడ్ని సీఎం, దళితులకు మూడు ఎకరాలు, ఇతరత్రా అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. అనంతరం దళిత వాడల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఎర్రం సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమందు విజయకృష్ణ, నాయకులు శివప్రసాద్, బంటు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆధ్వర్యంలో బ్యాక్ టు ది రూట్స్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్యులు

నిజామాబాద్ సిటీ: మన పూర్వీకుల ఆరోగ్యకరమైన జీవనశైలి, అలవాట్లను గుర్తించి వాటిని అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడానికి ‘బ్యాక్ టు ది రూట్స్’ అనే థీమ్‌తో ప్రజలకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెడికవర్ ఆస్పత్రి జనరల్ ఫిజిషియన్ దత్తురాజ్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎల్లమ్మగుట్ట మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మెడికవర్ ఆస్పత్రి భారతీయ సాంప్రదాయ జీవనం, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించటమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రతిఒక్కరూ మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలని, సరైన నిద్ర పోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యమే మహాభాగ్యం కరపత్రాలను విడుదల చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు సతీష్ సాహు, కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల తెలిపారు. శుక్రవారం ఇందూర్ న్యూరో సైకియాట్రి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ విశాల్ మాట్లాడుతూ.. కోవిడ్ అనంతరం జీవన విధానంలో అనేక రకాల మార్పులు వచ్చాయని, రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	59,550	వెండి (కిలో)	73,750
22 క్యారెట్స్	55,900	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	40	60
బెండకాయ	40	60	గాజరుగడ్డ	15	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	25	50	దోసకాయ	10	20
బీర్నీసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	8	15
వంకాయ	40	60	గోబిపువ్వు	20	40
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	12	25	చిక్కుడుకాయ	50	70
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్–1– దసరా–(తెలుగు),1.10,4.15 7.20,10.25
స్క్రీన్–2– మీటర్–(తెలుగు),10.20, 1.35,7.25
ది పోపెస్ ఎకరిస్ట్–(ఇంగ్లీష్),4.25,10.25
స్క్రీన్–3– రావణాసుర–(తెలుగు)–10.45, 1.40,4.30,7.20,10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– రావణాసుర –(తెలుగు) –10.00, 1.05,4.10,7.15,10.20
స్క్రీన్–2 – మీటర్–(తెలుగు) –1.25,4.15
దసరా –(తెలుగు)– 7.05,10.20
స్క్రీన్–3– జాక్‌విక్ చాప్టర్–4 (ఇంగ్లీష్)– 12.40
– భోళా–(హిందీ)–2డీ –4.10
–మీటర్–(తెలుగు) –7.20,10.10
స్క్రీన్–4– రావణాసుర –(తెలుగు),12.00
2డీ–ది సూపర్–ఎం–(ఇంగ్లీష్) ,3.05,7.45
ది పోపెస్ ఎక్సరా–(తెలుగు),5.20,10.00

దేవి	రావణాసుర
నటరాజ్	మీటర్
లలితామహల్	దసరా
విజయ్	బలగం